


సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేసిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, విక్రయం చేయరాదని తెలిపారు. దుకాణాలు, సంస్థలు, మాల్స్, ప్లాస్టిక్ నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తి, దిగుమతిలో తొలిసారి పట్టుబడితే 20వేలు జరిమానా విధిస్తామన్నారు. రెండోసారి రూ.40 వేలు జరిమానా విధిస్తూ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

- పట్టణంలో విద్యార్థుల ర్యాలీ
- ప్రభుత్వ విధానాలతో విద్యారంగానికి నష్టం
- బహిరంగ సభలో వక్తలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



అభివాదం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 30వ మహాసభలు శనివారం బొబ్బిలి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి తాండ్ర పాపారాయ విగ్రహం జంక్షన్ వరకు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి విధానాలతో విద్యా రంగానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. విజయగౌరి మాట్లాడుతూ పోరాటాల గెడ్డ బొబ్బిలిలో ఎస్‌ఎఫ్‌ఐ 1983లో ఏర్పడిందన్నారు. చదువుతూ పోరాడు చదువుకై పోరాడు నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ పని చేస్తోందన్నారు. రాజా కళాశాలను ఎయిడెడ్ నుంచి ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలోకి పాలకులు మతత్వాన్ని జొప్పిస్తున్నారని, ఇటువంటి విద్యార్థులంతా తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బైజూస్ యాప్‌తో విద్యారంగానికి తీవ్ర నష్టమన్నారు. విద్యారంగ సమస్యలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.



ఎస్‌ఎఫ్‌ఐ జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేయకపోయినా రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేసి ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పిజి కోర్సులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ జ్యూట్ మిల్లు మూతతో పిల్లలను చదివించుకునే స్తోమత లేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన సకాలంలో ఇవ్వడం లేదన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ, బహిరంగ సభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ పావని, తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు అశోక్

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ గంటి ప్రసాదం భవనంలో ప్రారంభమైంది. తొలుత ఎస్‌ఎఫ్‌ఐ జెండాను జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ ఎగురవేశారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభం కాగా, అధ్యక్ష వర్గంగా నాయకులు సిహెచ్ వెంకటేష్, ఎం.సౌమ్య రామకృష్ణ, వి.చిన్నబాబు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను ఎన్‌ఇపి పేరుతో పూర్తిగా తన చేతిలోకి తీసుకొని విద్యను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసే దుర్మార్గమైన పోకడలకు పోవడం అన్యాయమని అన్నారు. దేశంలో జాతీయ విద్యా విధానాన్ని ఎక్కడ అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో మాత్రం వేగంగా అమలు చేస్తున్నారు. దానిలో భాగంగానే స్కూల్స్ మూసివేత, డిగ్రీ ఇంటర్న్‌షిప్ తేవడం అన్నారు. గతంలో ఇంట్లో అందరికీ స్కాలర్‌షిప్ వచ్చేదని, ఇప్పుడు అమ్మఒడి అమలు ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి, విశాఖ ఉక్కును ప్రయివేటు చెయ్యొద్దని, బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేశారు.

త్రిపురలో హత్యా రాజకీయాలు దుర్మార్గం

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ
- నేడు మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపు

ప్రజాశక్తి-బొబ్బిలి, విజయనగరంటౌన్

త్రిపురలో బిజెపి హత్యా రాజకీయాలు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఖండించారు. బిజెపి మూకలు చేస్తున్న హింసాకాండను నిరసనగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసనలు తెలపనున్నట్లు వెల్లడించారు. బొబ్బిలి పట్టణంలోని గంటి ప్రసాదం భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో త్రిపురలో జరగనున్న ఎన్నికల్లో సిపిఎంను ఎదుర్కోలేక నాయకులు, కార్యకర్తలపై బిజెపి గూండాలు దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిపిఎం నేత షాహిద్ మియాపై బిజెపి గూండాలు దాడి చేసి హత్య చేశారన్నారు. త్రిపురలో సిపిఎం పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ లేదని, బిజెపి పాలనలో అవినీతి పెరిగిపోయిందని చెప్పారు. అవినీతి ఆరోపణలతో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవకుమార్‌ను మార్చివేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ భయంతోనే సిపిఎం నాయకులపై కాషాయి మూకలు హత్యా రాజకీయాలు చేస్తూ దాడులకు తెగబడుతున్నాయని మండిపడ్డారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన సాగిస్తోందని, ప్రజా సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగించేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, ఎస్.గోపాలం పాల్గొన్నారు.

5న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

బొబ్బిలిరూరల్ : ఈ నెల 5న మండల కార్యాలయాల వద్ద మధ్యాన్న భోజన కార్మికులు ధర్నాలు చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక ఎంఆర్‌సిలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచకపోగా తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెనూ ఛార్జీలకు రూ.20 ఇవ్వాలని, మార్చిన మెనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకుకూర అన్నం తొలగించాలని కోరారు. ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రయివేట్ పరం చేయకుండా ఆపాలని, నిర్వాహకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు పాల్గొన్నారు.

సంగీత ఝురి.. ఘంటసాల

నేడు శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగుసినిమా తొలి తరం నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నగరంలో జరుగనున్నాయి. పాడవోయి భారతీయుడా, లేచింది లేచింది నిద్ర లేచింది మహిళా లోకం, జానపద, యుగళగీతాలు, అనేక భక్తి పాటలు, భగవద్గీత గీతాలాపనలు, జీవితంలో నగ్నసత్యాలను పాడిన వారిలో ఘంటసాల ప్రముఖుడు. ఆయన జన్మించి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశ నలుమూలలా ఆయన జయంతి వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే ఆదివారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఘంటశాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 1922 డిసెంబర్ 4న కృష్ణాజిల్లా గుడివాడకు దగ్గరలో చౌటుపల్లిలో జన్మించారు. 1936లో తన చేతికి ఉన్న ఉంగరాన్ని ఎనిమిది రూపాయలకు విక్రయించి సంగీతంపై మక్కువతో రైలులో విజయనగరం చేరుకొని మహారాజ ప్రభుత్వ సంగీత కళాశాలలో చేరారు. 1942 డిగ్రీ పట్టా పొందాడు. 100 సినిమాలకుపైగా సంగీత దర్శకత్వం వహించారు. 13 వేలకు పైగా పాటలు పాడారు. చిట్ట చివరిగా భగవద్గీతను అనువాదం చేయడంతో దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి 1974 ఫిబ్రవరి 11న ఆయన మరణించారు. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్విరామ శత వసంతాల పాటల పండగ నిర్వహిస్తున్నారు. అంతకుముందు 8గంటలకు గుమ్చీ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించనున్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

మోటార్ బైక్‌లను పంపిణీ చేసిన మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదిమంది విభిన్న ప్రతిభావంతులకు, ట్రై మోటార్ బైకులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను, విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల్లో రక్తహీనత, పోషకాహారాన్ని తీసుకోకపోవడం, అయోడిన్, బి 12 లోపాలు, మేనరిక వివాహాలు తదితర కారణాలవల్ల వికలాంగులుగా శిశువులు జన్మిస్తున్నారని అన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుఓందని, పోషకాహారాన్ని పంపిణీ చేస్తోందని చెప్పారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, వికలాంగులు సైతం వివిధ రంగాల్లో తమ ప్రతిభను నిరూపించు కుంటున్నారని అన్నారు.



మోటార్ బైక్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు టచ్ ఫోన్లు, ట్యాబ్‌లు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, ఆర్‌టిఒ ఆదినారాయణ, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ స్వామినాయుడు, ప్రముఖ సామాజికవేత్త పివి నర్సింహారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వెయిట్ లిఫ్టింగ్' విజేతలకు అభినందన

విజయనగరం టౌన్ : యువత విద్యలోనే కాకుండా క్రీడలలో కూడా రాణించాలని గిరిజన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని తెలిపారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని గెలిచిన విజేతలను అభినందించారు. కట్టిమని మాట్లాడుతూ ఫిజికల్ లిటరసీ అందరికి అవసరమని, శారీరక దారుఢ్యం లేనిదే యువత ముస్ముందు భవిషత్తులో అభివృద్ధి చెందలేరని అన్నారు. క్రీడాకారులకు సహకారం ఇచ్చిన డాక్టర్ బిఎస్‌ఆర్ మూర్తి, తర్ఫీదు నిచ్చిన కోచ్‌లో సిహెచ్ రాము, మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఎం.వెంకటేష్, పి.శ్రీనులను అభినందించారు.

కోర్టులో తనిఖీలు

ప్రజాశక్తి-శృగవరపుకోట

పట్టణంలోని సెకెండ్ క్లాస్ కోర్టులో బొబ్బిలికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ శనివారం వార్షిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, సెకెండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సేవలు మరింత విస్తృతం

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తృతం చేయాలని నెల్లిమర్ల నగర పంచాయతీ అధికారులను, సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగో నెంబర్ సచివాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా సర్వీస్ రిజిస్టరు పరిశీలించిన ఆమె ఇంకా సర్వీస్ రిక్వెస్టులు పెరగాలని అభిప్రాయపడ్డారు. ఓటు నమోదు ప్రక్రియ, గృహ నిర్మాణ పనులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్వాడీల ద్వారా గర్భిణులకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీతన సమస్య లేకుండా జాగ్రత్త వహించాలని, గర్భిణులను, చిన్నారులను ముందుగానే పరిశీలించి అప్రమత్తం చేయాలని చెప్పారు. ప్రత్యేకమైన విద్యార్థులుంటే భవిత కేంద్రానికి సిఫార్సు చేయాలని పేర్కొన్నారు.

వాలంటీర్ తొలగింపునకు సిఫార్సు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

విధులకు సరిగా హాజరుకాని వాలంటీర్‌ను తొలగించాలని కలెక్టర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. హాజరు కేవలం 35 శాతమే ఉండటంపై ఆమె ఆరా తీశారు. అతనికి ఆసక్తి లేకపోతే తొలగించేయాలని అధికారులకు సూచించారు.

స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ప్రత్యేక శిక్షణ

వార్డు సచివాలయ పరిధిలోని వాలంటీర్లతో, ఎమ్మెల్సీ ఓటర్లతో పలు అంశాలపై మాట్లాడారు. వారు చదివిన చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో బీటెక్, కంప్యూటర్ సైన్స్ చదివిన అభ్యర్థులకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం ద్వారా సహాయ అందించడానికి కలెక్టర్ చొరవ చూపారు. కేవలం ఉద్యోగాల వైపే కాకుండా స్వయం ఉపాధి వైపు కూడా యువత దృష్టి సారించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె వెంట తహశీల్దార్ రమణ మూర్తి రాజు, ఎంపిడిఒ గిరిబాల, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇవిఎం గోదాములు తనిఖీ

నెల్లిమర్ల పరిధిలో ఉన్న ఇవిఎం గోదాములను కలెక్టర్ ఎ. సూర్యకుమారి శనివారం తనిఖీ చేశారు. భద్రతాపరమైన లోపాలు లేకుండా సరిచూసుకోవాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కార్బన్‌డై ఆక్సైడ్ సిలిండర్లను నిర్ణీత వ్యవధిలోగా రెన్యువల్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నెలవారీ తనిఖీలో భాగంగా గోదాములను సందర్శించిన ఆమె సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట డిఆర్‌ఒ ఎం. గణపతిరావు, తహశీల్దార్ రమణ మూర్తిరాజు, ఎంపిడిఒ గిరిబాల, ఎన్నికల విభాగ అధికారులు తదితరులు ఉన్నారు.

బిసి మహాసభను జయప్రదం చేయండి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న జయహో బిసి మహాసభను జయప్రదం చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో బిసి మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిలకు అన్ని విధాలా న్యాయం చేస్తానని ఇచ్చిన హామీలకు అనుగుణంగా అధికారం చేపట్టిన తర్వాత అనేక కార్యక్రమాలు నెరవేర్చు తున్నారన్నారు. సంక్షేమంలో 50శాతం బిసిలకే అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇదేం ఖర్మ అంటూ అశోక్ గజపతిరాజు స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. కరోనా సమయంలో ప్రజలను గాని, పార్టీ శ్రేణులను గాని పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. తెదేపా నాయకులకు ఓటు అడిగే హక్కే లేదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరండి

జయహో బిసి గర్జన సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు జిల్లా వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు.

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. గత ప్రభుత్వాలు బిసిలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని, కానీ బిసిలంటే ప్రభుత్వాలకు వెన్నెముక అనే భావనతో రాజ్యాధికారంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్యాబినెట్‌లో సుమారు 70శాతం బిసిలకు చోటు కల్పించారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు చనుమల్ల వెంకటరమణ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. జక్కువ గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ (26) శనివారం మొక్కజొన్న విత్తనాలు వేయడానికి యంత్రంతో వెళ్లాడు. ఒక పొలం నుంచి మరో పొలానికి యంత్రాన్ని భుజంపై తీసుకొని వెళ్తుండగా కిందకు వేలాడుతున్న వైర్లకు తాకింది. దీంతో విద్యుత్తు షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమీపంలోని రైతులు చూసి 108 వాహనానికి సమాచారం అందించారు. గజపతినగరం సిహెచ్‌సి రామకృష్ణను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన తుదిశ్వాస విడిచాడు. ఆంధ్ర పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.



మృతిచెందిన రామకృష్ణ

పెళ్లయిన ఆర్నెల్లకే

రామకృష్ణకు ఆరు నెలల క్రిత మే సునీత తో వివాహ మైంది. సునీత ప్రస్తుతం గర్భిణీ. పెళ్లయిన ఆర్నెల్లకే ఇటువంటి ఘటన జరగడంతో సునీత కుటుంబ న భ్యులతో పాటు గ్రామస్తుల రోదన వర్ణనాతీతం.



రామకృష్ణ భార్య సునీత

కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రోడ్లపై, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్ రోడ్డు, చింతాడవీధి, యాతవీధి, సిద్ధావీధి, కుమ్మరివీధి, గౌడవీధిలో పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు చెత్త ఇవ్వాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరస్పర విమర్శలు.. రాజకీయ విన్యాసాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'రాజకీయాలను జనం పట్టించుకోకపోయినా, రాజకీయాలు మాత్రం జనం జీవితాలను ప్రభావితం చేస్తునే ఉంటాయి. కానీ, ఆ రాజకీయాలు జనాలకు సంబంధం లేకుండా సాగిపోతే, అటువంటివాటిని ప్రజలు కూడా పట్టించుకోరు. అట్టి రాజకీయాలు ఇప్పటికిప్పుడు కొంత గందరగోళానికి, మభ్యపెట్టడానికి సంబంధిత రాజకీయ పార్టీలకు, నేతలకు ఉపయోగపడవచ్చు. కానీ, ఆచరణలో ఇటువంటి రాజకీయ విన్యాసాలు సాగబోవు'. ఇదీ గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లాలో సాగుతున్న పబ్లిక్‌టాక్. జిల్లాలో ఇటీవల కాలంలో సాగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఈనెల 29న వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఆ మరునాడు వచ్చిన ఎస్‌సి సంక్షేమ కమిటీ చైర్మన్ గొల్లబాబురావుల పర్యటనలపై అచ్చంగా అటువంటి విమర్శలే వినిపిస్తున్నాయి. గృహ నిర్మాణంలో ప్రభుత్వం అవినీతి బాగోతం వెలికితీత, లబ్ధిదారులు ఇబ్బందుల పేరిట గుంకలాం జగనన్న కాలనీకి పవన్ కల్యాణ్ రాగా, నాలుగు రోజుల క్రితం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కూడా జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయలు, ఇతర ప్రజాప్రతినిధులను వెంటబెట్టుకుని అదే కాలనీని సందర్శించారు. ఇద్దరి పర్యటనలోనూ లబ్ధిదారులకు మేలు చేసేదానికన్నా రాజకీయ విన్యాసాలే ప్రదర్శించారని జనం చర్చించుకుంటున్నారు.



పవన్ రాక నేపథ్యంలో పాపం ఆ పార్టీ నాయకులు లబ్ధిదారులను కూడబెట్టి మండుటెండలో కూర్చోబెట్టారు. సమస్యలు చెప్పుకుందామనో, సినీస్టార్‌తో ముఖాముఖీ అవకాశం దక్కుతుందనో దాహానికి ఓర్చి మరి ఎదురెండలో గంటల తరబడి నిరీక్షించారు. తీరా పవన్ వచ్చాక కారుదిగక్కుండానే మాట్లాడి వెళ్లిపోవడంతో లబ్ధిదారుల ఆగ్రహ ఆవేశాలు కట్టలు తెంచుకున్నాయి. ఈ పాటిదానికి ఇంతసేపు ఎందుకు ఇబ్బందిపెట్టాలా? అంటూ కసరుకున్నారు. నాయకులు వారికి సమాధానం చెప్పుకోలేక చిన్నబోవాల్సిన పరిస్థితి కనిపించింది. మరోవైపు గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము సరిపోందంటూ వ్యాఖ్యానించారు. దీంతో, 'అబ్బా' పవన్‌కు ఇన్నాళ్ల వరకు ఈ విషయం బోదపడలేదా? అంటూ పలువురు చర్చించుకున్నారు. భూమి కొనుగోలులో రూ.కోట్ల అక్రమాలు జరిగాయని కూడా ఆరోపించారు. కానీ, ఇంత పెద్దకాలనీకి వచ్చిన ఆయన అక్రమాలు, అవినీతి బాగోతాలు ఎలా? ఏ రూపాల్లో జరిగాయో చెప్పలేదు. అందుకు బాధ్యులు ఎవరనేది ప్రస్తావించలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు అవినీతి జరిగితే నిరూపించాలని సవాలు చేసినా జనసేనకు నాయకులకు పట్టలేదు. అధికార పక్షం సమర్ధింపులు పక్కనబెడితే దొంగలు పడ్డ ఆరు నెలల వరకు చోరీ విషయం గుర్తుకు రాలేదన్నట్టుగా సుమారు రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన భూ వ్యవహారాలపై ఇప్పటివరకు నోరు మెదపని పవన్ ఇప్పటికిప్పుడు ఎందుకు ప్రస్తావించారనేది కొంతమంది నోట వినిపించింది. ఈ మాట కొస్తే టిడిపి హయాంలో గృహ నిర్మాణాలు పడకేశాయి. పేదలకు సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు దాదాపు లేవు. ఈనేపథ్యంలో ఆ పార్టీ నాయకులు ఇళ్లు, ఇళ్ల స్థలాల విషయంలో వైసిపిని విమర్శించే నైతిక అర్హత కోల్పోయారు. ఈనేపథ్యంలో పవన్‌ను పావుగా వాడుకుని అధికార పార్టీపై విమర్శలు చేయిస్తుందని చాలా మంది చర్చించు కుంటున్నారు. ఇదిలా ఉంటే, గతనెల 29న జిల్లాకు వచ్చి అదే కాలనీని సందర్శించిన మంత్రి జోగి రమేష్ చేసిందేంటనేది ప్రతిపక్షం, జనసేనతోపాటు తటస్థంగావున్న వారి వాదన. హడావుడిగా వచ్చిన మంత్రి అధికారులు, ప్రజాప్రతిధులును వెంటబెట్టుకుని కాలనీలో పర్యటించారు. ఒక్కరంటే ఒక్క లబ్ధిదారుతోనూ మాట్లాడలేదు. సాదకబాధకాలు తెలుసుకోలేదు. సుమారు 11వేల స్థలాలు కలిగిన ఈ కాలనీలో పట్టుమని పాతిక ఇళు కూడా పూర్తికపోయినప్పటికీ ప్రశ్నించలేదు. ఆహాఓహో అంటూ ప్రభుత్వాన్ని సమర్ధించుకుంటూనే తిరిగి పవన్ కల్యాణ్‌ను విమర్శించడంతోనే సమయం సరిపెట్టారు. ఇటు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో చేపట్టిన సమీక్షా సమావేశంలోనూ ఇళ్ల నిర్మాణంలో వెనుకబాటుకుగల కారణాలపై లోతైన చర్చలేదు. ఉపన్యాసాలు, సన్మానాలు, సత్కారాలతో సమయం సరిపోయింది. ఈనెల 30జిల్లాకు వచ్చిన ఎస్‌సి సంక్షేమ కమిషన్ చైర్మన్ కూడా క్షేత్ర స్థాయికి వెళ్లలేదు. అధికారులతో సమీక్షలతోనే సరిపెట్టడంతో దళితులు, దళిత సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇటువంటి పర్యటనలపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని రంగరాయపురం సచివాలయ పరిధిలోని చెల్లారపువలస గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో 95 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలిపే కరపత్రాలను చూపిస్తూ సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. గ్రామంలో పలువురు సిసి రోడ్డు, ఇళ్లు కావాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, వైసిపి నాయకులు గేదెల సత్యనారాయణ, కోట గోవింద, కొప్పర నారాయణరావు పాల్గొన్నారు.

వెనుకబడిన తరగతులే వెన్నెముక

ప్రజాశక్తి-కొత్తవలస

బిసిలంటే వెనుకబడి తరగతులు కాదని, వెన్నుముకగా సిఎం జగన్ చూస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో బిసి ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో జయహో బిసి మహాసభ పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, డిసిసిబి చైర్మన్ వి.చినరామునాయుడు, రొంగలి జగన్నాథం, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వాకాడ రాంబాబు, డి.సత్యారావు, వైసిపి మండల అధ్యక్షులు జి.రవికుమార్, పినిశెట్టి వెంకటరమణ, ముమ్ములూరు జగన్నాథం, ఒబ్బిన నాయుడు, కూరాకుల సూర్యారావు, గుమ్మడి సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, వైస్ ఎంపిపిలు కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం గ్రీన్‌అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-కొత్తవలస



వినతి అందిస్తున్న నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్ల సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు 7 నెలల నుంచి 24 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిలతో ఎన్నాళ్లు పస్తులుండి పనిచేయమంటారని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్య రక్షణ, గ్రామ పరిశుభ్రత కోసం పనిచేసిన కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా వేధింపులకు దిగడం, తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పి.అసిరి నాయుడు, ఎ.అచ్చియమ్మ, జి.ఎర్రయమ్మ, యు.అప్పారావు, కె.అర్జున , వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతకాని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఎద్దేవాచేశారు. శనివారం మండలంలోని బొడ్డవర గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జనాల సమస్యలను తెలుసుకున్నారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇందుకూరి శ్రీనురాజు, నాయకులు వాకాడ బాలు పాల్గొన్నారు.

రాజేంద్ర ప్రసాద్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి- విజయనగరం కోట

భారత స్వతంత్ర సమరంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి బాబు రాజేంద్రప్రసాద్ దేశానికి అందించిన సేవలు ఎనలేనివని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణ రావు కొనియాడారు. శనివారం స్థానిక గాజులు రేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకను సోషల్ టీచర్ ఎం.ాయనమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ గాంధీజీతో పాటు క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం పోరాటాల్లో క్రియాశీలక పాత్రను పోషించారన్నారు. ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలైన విద్యార్థులకు పుస్తకాలను బహుకరించారు.

విద్యార్థినులకు పరామర్శ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి ప్రభుత్వ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వైద్యం పొంది, తిరిగి వసతిగృహానికి చేరుకున్న విద్యార్థులను ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆహారం విషయంలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, వసతిగృహ పరిసరాలలో పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ సిహెచ్.ధనలక్ష్మి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త స్వాతి తెలిపారు. వీరి పర్యవేక్షణలో శనివారం సీతారాంపురం గ్రామంలో వరిలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరాకు 40 బస్తాలు వస్తాయని అంచనా వేశారు. కార్యక్రమంలో విఎఎ ఉదయశ్రీ, ఎంటి సత్యనారాయణ, ఎంఎ అనురాధ, సంతోషి పాల్గొన్నారు.

రఘుమండలో క్లీన్ ఇండియా

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని రఘుమండ గ్రామంతో పాటు జిల్లా పరిషత్తు పాఠశాలలో శనివారం ప్రాజెక్ట్ వికాస్ 2022లో భాగంగా, ఎఫ్‌వైఎఫ్‌పీ, ఎంవిజిఆర్ యూనిట్ ఆధ్వర్యంలో 'క్లీన్ ఇండియా క్యాంపెయిన్, కాలుష్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్.వై.ఎఫ్.పీ కన్వీనర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ కాగితం సంచులు, జనపనార సంచులు వినియోగించాలన్నారు. వీధి నాటకంలో ప్లాస్టిక్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల కలిగే సమస్యలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.వై.ఎఫ్.పీ వాలంటీర్లు, ఎన్.ఎన్.ఎస్ పీ.ఓ ఎన్. షణ్ముఖ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఆర్‌పి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గురువులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఆంధ్రప్రదేశ్ సిఆర్‌పి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మండలానికి చెందిన జి. గురువులు ఎంపికయ్యారు. గురువులు పూసపాటిరేగ మండలంలో సిఆర్‌పిగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర సభలో సిఆర్‌పి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా గిరి శ్రీనువాసు, ప్రధాన కార్యదర్శిగా గురువులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాద్యతను ఫెడరేషన్ ఆశయాలకు అనుగుణంగా కొనసాగిస్తానన్నారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత, జీతాలు పెంపుదల, మినిమమ్ టైమ్ స్కేల్ కోసం కృషి చేస్తామన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా కార్యక్రమాలన్నింట ప్రముఖ పాత్ర పోషిస్తున్నా తమను మాత్రం గుర్తించడం లేదన్నారు. తాము ఉద్యోగంలో చేరి పది సంవత్సరాలు పూర్తవుతున్నా తమను రెగ్యులైజేషన్ చేయకపోవడం విచారకరమన్నారు. తమ సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరాడతామన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తాటిపాడు గ్రామ టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ కొమ్ము శ్రీరాములు తల్లి నరసమ్మ ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని మాజీ మంత్రి, రాజాం టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోండ్రు మురళీమోహన్ శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, జెడ్‌పిటిసి మంతిన ఉషారాణి, దూబ ధర్మారావు, బాలి రామినాయుడు, రమేష్, నాగభూషణ, గోవిందరావు ఉన్నారు.

వికలాంగుల్లో ఆత్మ స్థైర్యం నింపాలి



కొత్తవలస.. మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణశ్రీ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వికలాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామభద్రపురం : వికలాంగ విద్యార్థుల సేవే పరమావధిగా భవిత కేంద్రంలో విశిష్ట సేవలు అందిస్తున్నారని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు తెలిపారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమగ్ర శిక్ష ద్వారా వికలాంగ పిల్లలను అనేక పథకాలతో ఆదుకుంటోందన్నారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అధికార యంత్రాంగం, వికలాంగ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఐఇఆర్‌పిలు బి.అచ్యుతరావు, సిహెచ్ రాజేశ్వరి, వైసిపి నాయకులు కనిమెరక అప్పారావు, పూడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: వికలాంగులు భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు అనేక రకాల రాయితీలను కల్పిస్తుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎపిఒ, పెదతాడివాడ స్కూల్ హెడ్ మాస్టర్, భవిత కేంద్ర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయనగరం : వికలాంగ పిల్లల్లోని సామర్థ్యాలను గుర్తించాలని జిల్లా సహితవిద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు అన్నారు. స్థానిక నగర పాలక కళ్యానంద భారతి పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వికలాంగుల్లో సాధారణ పిల్లలవలే అన్ని సామర్థ్యాలు ఉంటాయని వాటిని గురువులు, తల్లీదండ్రులు గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగులకు అనేకమైన రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటని వినియోగించుకోవాలని తెలిపారు. సమగ్రశిక్షా ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు ఆర్థిక భత్యాలు, సహాయక ఉపకరణాలు అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహితవిద్య సహాయ సమన్వయకర్త ఎం. భారతి, పాఠశాల ప్రధానోపాద్యాయుడు ఆర్.సి.హెచ్ అప్పారావు, సహిత విద్య ఉపాధ్యాయులు బంగారునాయుడు, సూర్యారావు, గాబ్రియల్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వికలాంగ పిల్లలను ఆదరించి ఆదుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వికలాంగ దినోత్సవం జరిగింది. ఈ సంధర్భంగా ఎండిఒ జి. గిరిబాల, తహశీల్దారు కె.వి.రమణ రాజు, ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావులు పాల్గొని మాట్లాడారు. భవిత కేంద్రం వికలాంగులకు దాత డి. అశ్వని రూ.23వేల విలువైన వాటర్ ట్యాంక్, పైపులు, 16జతల యూనిఫామ్ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్‌టి బెల్లాన అప్పల నాయుడు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగ : స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ వికలాగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా వికలాంగ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో పూసపాటిరేగ పాఠశాల సముదాయ చైర్మన్ బి. శంకరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, ఈశ్వరరావు, సహిత విద్య ఉపాధ్యాయుడు ఎం. వెంకటేశ్వరరావు, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గరివిడి : స్థానిక విద్యావనరుల కేంద్రం సమీపంలో ఉన్న భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కె.క్రిష్ణంనాయుడు, మండల పరిషత్ ఎఒ కృష్ణమూర్తి, ఎంఇఒ పి.రామారావు పాల్గొన్నారు.

గరివిడి : చీపురుపల్లి పట్టణం పోలీస్ లైన్ స్కూల్ భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, నాయకులు నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వికలాంగ విద్యార్థులకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలిపొందిన వారికి గ్రామ సర్పంచ్ బి. కన్నమ్మ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బి. గోపి, కోపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్ కే.గుర్రాజు, ప్రధానోపాధ్యాయులు, ఐఆర్‌పిఎస్ ఎం. సత్యనారాయణ, పి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. బహుమతులు అందజేస్తున్న శంకరరావు



బొండపల్లి.. ర్యాలీ చేపడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, వికలాంగ విద్యార్థులు

రేగిడి: స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ టి. కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ రావు మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, వాటర్ బాటిల్, టిఫిన్ బాక్సులు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకసహిత ఉపాధ్యాయుడు ఆర్. రాంబాబు, ఎంఐఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొండపల్లి : విభిన్న ప్రతిభావంతుల విషయంలో చిన్నచూపు వద్దని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం ఐఇఆర్‌సి గీత ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వేదవతి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.సతీష్‌కుమార్, ఎంఆర్‌సి ప్రదీప్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : వికలాంగులు మానసిక ధైర్యంతో లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నం చేయాలని వైసిపి నాయకులు అవనాపు విక్రమ్ అన్నారు. కనపాక యూత్ హాస్టల్ ఆవరణలో స్పందన వికలాంగుల సేవా సమాజం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. సేవా సమాజం అధ్యక్షుడు కందివలస సురేష్ సేవలను అభినందించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన గీతం కళాశాల చైర్మెన్ భరత్, బీశెట్టిబాబ్జితో కలిసి సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అనురాధ బేగం, పివిఆర్ , రుక్మాకర్ రావు, గొలగాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వంగర : వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని వంగరలో నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.దుర్గారావు, వైసిపి నాయకులు పారినాయుడు, ఐఆర్‌పిలు సంగోజీ లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : స్థానిక ఆంజనేయపేటలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణశ్రీ మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బోజంకి సన్యాసిరావు, న్యాయవాదులు డి.శ్రీనివాస్, గవర కృష్ణ, ఉమాదేవి, ఎఎస్ఐ రెహమాన్ పాల్గొన్నారు.

హౌసింగ్‌డేలో సమస్యల వెల్లువ



శృంగవరపుకోట.. లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్‌డిసి సుదర్శనదొర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి, బానాది గ్రామాల్లో శనివారం చేపట్టిన హౌసింగ్ డే కార్యక్రమానికి లబ్ధిదారుల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలు తెలుసుకున్నారు. బల్లంకిలో 18 జగనన్న గృహాలు మంజూరు కాగా వాటిలో 13 మంది పునాదులు తీసుకోలేదు. నీరు, కరెంటు సౌకర్యం లేకపోవడంతో పనులు ప్రారంభించలేదని లబ్ధిదారులు తెలిపారు. వెంటనే ఎంపిపి దొగ్గ సత్యవంతుడు స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజుతో ఫోన్‌లో మాట్లాడి, వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని సూచించారు. జెడ్‌పిటిసి శానాపతి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఇచ్చిన నిధులు సరిపడక పోవడంతో వైకెపి కార్యాలయం నుంచి రూ.35 వేలు చొప్పున సున్నా వడ్డీ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ ప్రభుత్వం 1.77 ఎకరాలను ఇళ్ల నిర్మాణం కోసం సేకరించిందన్నారు. ఆన్‌లైన్‌లో 40 మంది దరఖాస్తు చేస్తే, వీరిలో 28 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులకు మిగతా స్థలంలో పట్టాలివ్వాలని కోరారు. ఈ నెల 21లోగా పనులు ప్రారంభించకుంటే, స్థలాలు తిరిగి తీసుకుని, వేరొకరికి ఇస్తామని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు తెలిపారు. సమావేశంలో వైస్‌ఎంపిపి అడపా ఈశ్వరరావు, బానాది సర్పంచ్ కర్రి యశోద, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, నాయకులు బి.కనకరాజు, బొడ్డు శ్రీను, నూకిరెడ్డి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మండల కేంద్రంలో మంజూరైన జగనన్న గృహాల లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ సూచించారు. శనివారం మండల ప్రత్యేక అధికారి ఎస్‌పికె మల్లేశ్వరరావుతో కలిసి 1, 2 లేఅవుట్లను పరిశీలించారు. నిర్మాణాలు ప్రారంభించని, పలు స్థాయిల్లో నిలిపేసిన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తహశీల్దార్ సూచించారు. లేకుంటే పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రూపేష్ , హౌసింగ్ ఎఇ టి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలో అమ్మపాలెం, కాపుసోంపురం గ్రామాల్లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర, బొడ్డవర సర్పంచ్ మీనా, ఎంపిటిసి లక్ష్మి, కిల్తంపాలెం సర్పంచ్ ఈశ్వరరావు, నాయకులు మురళీరాజు, కేతా వీరన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన



వేపాడ.. మాట్లాడుతున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం సచివాలయంలో ధాన్యం కొనుగోలుపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నీలకంఠరాజపురం, చిన్నగుడిపాల, నల్లబెల్లి, వావిలిపాడు, పెదగుడిపాల గ్రామాల రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ వివి చినరామనాయుడు మాట్లాడుతూ ప్రతి రైతూ రైతు భరోసా కేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఏ ఒక్క రైతు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈర్లే బంగారు నాయుడు, ఎఒ యశ్వంత్, వావిలపాడు గ్రామ నాయకులు బీల సతీష్, సర్పంచి జి.దేవి, తదితరులు పాల్గొన్నారు. వేపాడ సచివాలయంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్రావు, పిఎసిఎస్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ ఎం.అర్జునమ్మ పాల్గొన్నారు.

కొత్తవలస : కంటకాపల్లి ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎడి భారతి, ఎఒ చంద్రకళ ఆర్‌బికెలు, కొత్తవలస కోఆపరేటివ్ సొసైటి ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మదిన లక్ష్మి, గ్రామ నాయకులు అప్పలరమణ , వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, ఎంపిటిసి సురేష్, పిఎసిఎన్ పాత్రుడు , పంచాయతీ కార్యదర్శి మాధవి లత, ఉద్యాన సహాయకులు రవి ప్రకాష్, విఆర్ఒ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లింగ వివక్షపై ర్యాలీ

ప్రజాశక్తి - భోగాపురం

మండల కేంద్రంలో శనివారం మండల ప్రత్యేకాధికారి పద్మావతి ఆధ్వర్యంలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా ర్యాలీని నిర్వహించారు. దీనికి ముందు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ బంగారయ్య, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఇతర అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన టార్గెట్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ప్రతీ శనివారం హౌసింగ్ కార్యకలాపాలు, హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ముంజేరు హౌసింగ్ లేఔట్‌ను సందర్శించి అక్కడున్న లబ్ధిదారులకు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

మెరక ముడిదాం: సమాజంలో ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా అందరిని గౌరవించి లింగ వివక్షతకు ముగింపు పలుకుదామని గాతాడ గ్రామస్తులు ఎపిఎం ఉమామహేష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో శనివారం జెండర్ ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ మగపిల్లలతో పాటు ఆడపల్లిలకు కూడా సమాన విద్య, ఎదుగుదలకు సమాన అవకాశం కల్పిస్తామన్నారు. సమాన ఆస్తి హక్కులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వంగర.. ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

వంగర : సమాజంలో లింగ వివక్షకు ముగింపు పలకాలని ఎపిఎం మీసాల చక్రపాణి కోరారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో గీతనాపల్లిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచారాలను, బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

కలెక్టర్ ఎ.సూర్యకుమారి



డెంకాడ.. మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-డెంకాడ

ఓటు వజ్రాయుధం లాంటిదని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరూ ఓటుహక్కు పొందాలని ఆమె పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక లెండి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సామూహిక ఓటుహక్కు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కును కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఓటుకోసం 17 ఏళ్లకే ముందుగానే తమ పేరు నమోదు చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఇలా పేరు నమోదు చేసుకున్నవారికి, 18 ఏళ్లు నిండినవెంటనే ఓటు హక్కు కలుగుతుందని, అప్పుడు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, శతశాతం ఓటుహక్కు పొందాలని కోరారు.కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, నెల్లిమర్ల నియోజకవర్గ ఇఆర్ఒ ఎం.నూకరాజు, తాహశీల్దార్ ఆదిలక్ష్మి, లెండి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హరిబాబు, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్.. ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

విజయనగరం టౌన్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు విద్యార్థులకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ ముమ్మరం గా చేపడుతున్న నేపథ్యంలో నగరంలోని వివిధ కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు ఓటరు నమోదుపై చైతన్యాన్ని తీసుకువస్తున్నారు. శనివారం స్థానిక వెంకటరమణ డిగ్రీకళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడారు. ఆన్‌లైన్ విధానంలో కూడా ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు.

బొబ్బిలిరూరల్ : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆర్‌డిఒ శేషశైలజ కోరారు. శనివారం మండలంలోని పిరిడి, కోమటిపల్లి, కలవరాయి గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గోకుల్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు ఓటుహక్కు వినియాగంపై అవగాహన కల్పించారు. బిఎల్ఒలంతా ఇంటింటి వెళ్లి సర్వే ద్వారా కొత్త ఓటర్లను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్, సూపర్‌వైజర్ చుక్క శ్రీనివాసరావు, కార్యదర్శులు జగదీష్, మూర్తి, ప్రసాద్, దేవి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు సూచించారు. శనివారం డిగ్రీ కళాశాలలో నోడల్ ఆఫీసర్ కరుణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎలక్షన్ డిటి లక్ష్మి ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు.

నిరుద్యోగులకు వయోపరిమితి పెంచాలి

ప్రజాశక్తి- గరివిడి

రాష్ట్రంలో నిరుద్యోగులకు వయోపరిమితి పెంచాలని నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కిమిడి నాగార్జున కోరారు. చీపురుపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నోటిఫికేషన్‌లో గరిష్ట వయస్సు వల్ల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఒసి అభ్యర్థులకు 24 సంవత్సరాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి వికలాంగ అభ్యర్థులకు 5 సంవత్సరాలులు మాత్రమే సడలింపు ఇచ్చారన్నారు. సుమారు 5 సంవత్సరాలు తరువాత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి వయో పరిమితి తక్కువ ఇవ్వటం వల్ల గ్రామాలలో పోలీస్ కొలువులకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు అర్హత కోల్పోయారన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు అన్ని వర్గాల నిరుద్యోగులకు 5 సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, మహంతి అప్పల నాయుడు, దన్నాన సూరప నాయుడు, మహంతి రమణ మూర్తి, సప్ప సూరప్పడు, మీసాల శ్రీధర్ నాయుడు, గడే సన్యాసప్పలనాయుడు, గడే సత్యనారాయణ, కెంబూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

విజయనగరం కోట : విజయనగరం రీమాపేటకు చెందిన పలువురు శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముత్తంశెట్టి వేణు చౌదరి, మండల నాయకులు బొద్దల నర్సింగరావు ఆధ్వర్యాన 20 కుటుంబాలు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, నగర అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కంది మురళీనాయుడు, దేవవర్మ రాజు (రాజేష్ బాబు) తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

శృంగవరపుకోట : పట్టణంలోని అఫీషియల్ కాలనీలో ఒక ఇంట్లో రెడ్డి ఎర్రి నాయుడు (24) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లోవరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రెడ్డి ఎర్రి నాయుడు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగాగల బిగ్-సి స్టోర్‌లో పనిచేస్తున్నాడు. పట్టణంలోని అఫీషియల్ కాలనీలో గల తన పెదనాన్న అల్లుడి ఇంటికి వెళ్లిన ఎర్రినాయుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రి నాయుడుకు పెద్దగా చదువు లేకపోవడం, సరైన ఉద్యోగం లేనందున, ఆర్థికపరమైన ఇబ్బందుల వలన ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి వెంకట రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.